సాక్షి నిర్మల్

సోమవారం । 26 । జూన్ । 2023



మాకేది పెట్టుబడి?

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక సాగులో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు బంధు, రైతుబీమా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలని కోరుతున్నారు. 8లో▸



నాలుగు దశాబ్దాలైనా తరగని స్నేహం

నలభై ఏళ్ల క్రితం ఎస్సెస్సీ పూర్తి చేసి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒక్కచోట చేరారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0 / 24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరుగుతుంది. జిల్లాలో పలుచోట్ల వానలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బాసర ఆలయంలో భక్తుల రద్దీ



దర్శనానికి బారులుతీరిన భక్తులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరినదిలో పుణ్య స్నానాలాచరించారు. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, శివుని, అప్పారావుపేట్, ఇస్లాపూర్, మలక్‌జాం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. చిన్నారుల తలనీలాలు సమర్పించి, తులాభారం వేయించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అడెల్లి ఆలయంలో భక్తుల సందడి



విరాళం ఇస్తున్న రాఘవులు కుటుంబీకులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీవో సీహెచ్ రాఘవులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన సతీమణి సుజమ్మ, కుమారుడు సీహెచ్ రమేశ్, కూతుళ్లతో కలిసి ఆలయానికి రూ.లక్షా 11వేల 116లను విరాళంగా చెక్కు రూపంలో అందజేశారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా నల్ల మేకల పండుగ



ఆలయం ఎదుట బోనాలతో మహిళలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని మహాలక్ష్మీ, పోచమ్మ, మల్లెవ్వ, అడెల్లి పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ ఆలయాల వద్ద ఆదివారం ఘనంగా నల్ల మేకల పండుగ నిర్వహించారు. ఆలయాల్లోని గ్రామదేవతలకు మహిళలు పిండి వంటలతో చేసిన బోనాలు సమర్పించారు. సుద్దవాగు నుంచి తెచ్చిన నీటితో విగ్రహాలను శుద్ధిచేశారు. వానలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

అమ్మవారికి తొలిబోనం



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న కుమ్మరులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ అమ్మవారికి కుమ్మరులు ఆదివారం తొలిబోనాన్ని సమర్పించారు. జిల్లా కుమ్మర సంఘం, కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం (కేవా) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని మొల్లమాంబ విగ్రహం నుంచి మహాలక్ష్మీ ఆలయానికి బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, కేవా జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి రవీందర్, నాయకులు శంకర్, రవికాంత్, సాయన్న, స్వామి, మల్లేశ్, అరుణ్‌కుమార్, రాములు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతువేదికలకు నిధులేవి?



తాండ్ర రైతువేదిక

- పదినెలలైనా విడుదల చేయని ప్రభుత్వం
- నెల ఖర్చులు రూ.15వేలకు పైగానే..
- ప్రభుత్వం చెల్లిస్తోంది రూ.9వేలు మాత్రమే
- ఇవి కూడా ప్రతినెలా చెల్లించని వైనం
- వ్యవసాయ విస్తరణాధికారులపైనే భారం
- నీరుగారుతున్న తెలంగాణ సర్కార్ లక్ష్యం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతువేదికల నిర్వహణ భారంగా మారుతోంది. వేదికల నిర్వహణ ఖర్చులు 10 నెలలైనా విడుదల చేయలేదు. దీంతో వేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. వీటి నిర్వహణ భారం వ్యవసాయ విస్తరణాధికారులపై (ఏఈవోలు) పడుతోంది. విద్యుత్ బిల్లులు, స్వీపర్, తాగునీటి సౌకర్యం, జిరాక్స్, స్టేషనరీ, ఇంటర్నెట్ ఖర్చుల కోసం ప్రతినెలా రూ.9వేల చొప్పున ఏఈవోలకు చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు రూ.45 వేలు ఏఈవోలకు చెల్లించింది. అప్పటినుంచి సుమారు 10 నెలలుగా నిధులు విడుదల చేయలేదు. దీంతో వేదికల నిర్వహణ భారంగా మారిందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ మూలకూ సరిపోని నిధులు..

రాష్ట్ర ప్రభుత్వం నెలకు చెల్లిస్తున్న రూ.9 వేలు ఏ మూలకూ సరిపోవడం లేదు. గ్రామాల్లో స్వీపర్, తాగునీరు పెట్టినందుకు కనీసం నెలకు రూ.4వేల వరకు తీసుకుంటున్నారు. కరెంట్ బిల్లులు ప్రతినెలా రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు చెల్లించాల్సి వస్తోంది. జిరాక్స్, స్టేషనరీ, ఇంటర్నెట్, మైక్, స్నాక్స్, టీల కోసం రూ.7వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఏఈవోలు పేర్కొంటున్నారు. ప్రతినెలా తాము ప్రభుత్వం ఇచ్చిన నిధుల కంటే అదనంగా రూ.5వేల వరకు భరించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఈ నెలలో నిర్వహించిన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతువేదికల్లో వివిధ శాఖలకు చెందిన సమావేశాలు నిర్వహించారు. అప్పుడు కూడా తమపై అదనపు భారం పడిందని ఏఈవోలు పేర్కొంటున్నారు. ఒక్కో క్లస్టర్‌కు 5వేల ఎకరాల చొప్పున ఉండాల్సి ఉండగా కొన్ని క్లస్టర్లలో 16వేల ఎకరాలు ఉండడంతో పనిభారం పెరిగి ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. కాలం చెల్లిన ట్యాబ్‌లు, ఇంటర్నెట్ సరిగా పనిచేయకపోవడంతో పంటల వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయలేపోతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతువేదికల నిర్వహణ కోసం ఇచ్చే నిధులను కనీసం రూ.15వేలకు పెంచి ప్రతినెలా చెల్లించాలని, కొత్త ట్యాబ్‌లు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో 79 క్లస్టర్లు

రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి రైతులకు వ్యవసాయశాఖ అధికారులతో సాగులో మెలకువలు, ఇతర సాంకేతిక విధానాలను తెలియజేయడం కోసం ప్రతీ ఐదువేల ఎకరాలకు ఒక వ్యవసాయ క్లస్టను ఏర్పాటు చేసింది. క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని నియమించింది. ఒక క్లస్టర్‌కు ఒకటి చొప్పున జిల్లాలో 79 రైతు వేదికలు నిర్మించింది. వాటి నిర్వహణ బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు అప్పగించింది. ఇందులో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పాటు సైంటిస్ట్‌తో ప్రతీ శుక్రవారం సభలు, సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని సంకల్పించింది. కానీ.. వాటి నిర్వహణకు నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

నిధులు రాగానే చెల్లిస్తాం

రైతువేదికల నిర్వహణ నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు విడుదల కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేస్తాం. ఏఈవోలు రైతువేదికల్లో విధిగా సమావేశాలు నిర్వహించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

పాఠశాలల్లో 'పఠనోత్సవం'



- నేటినుంచి 'రీడింగ్ క్యాంపెయిన్'
- పఠనాసక్తి పెంపొందించడమే లక్ష్యం
- జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ
- సర్కార్‌బడులపై పకడ్బందీ పర్యవేక్షణ

నిర్మల్ ఖిల్లా: ఇక ప్రభుత్వ బడుల్లోని పిల్లల్లో పఠన నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా 'పఠనోత్సవం' (రీడింగ్ క్యాంపెయిన్) నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 26నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులందరికీ ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ధారాళంగా చదవడం, చదవడం ఒక అలవాటుగా చేసుకోవడం, చదవడం ద్వారా ఆనందం పొందడం, స్వతంత్ర పాఠకులుగా ఎదగడం దీని ప్రధాన లక్ష్యాలుగా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయనున్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేయాల్సిఉంటుంది.

పుస్తక పఠనం కోసం ఓ పీరియడ్

పఠనోత్సవంలో భాగంగా ప్రతిరోజూ పుస్తక పఠనం కోసం ఒక పీరియడ్ కేటాయిస్తారు. ప్రతిరోజూ, ప్రతీ పీరియడ్‌లో ప్రతీ ఉపాధ్యాయుడు తన సబ్జెక్టుకు సంబంధించిన అంశాన్ని విద్యార్థులతో పది నిమిషాలు బాహ్య పఠనం చేయించాలి. చార్టులపై లేదా నల్లబల్లపై పదాలు రాసి ప్రదర్శించాలి. అలాగే గ్రంథాలయ పీరియడ్‌లో ప్రతిరోజూ విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించాలి. మూడురోజులు మాతృభాషలో, మిగతా మూడు రోజులు ఆంగ్ల భాషలోని కథల పుస్తకాలు చదివించాలి. గ్రంథాలయ కమిటీలు ఏర్పాటు చేయాలి. వీరు విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా పుస్తకాలు గ్రంథాలయం నుంచి ఎంపిక చేసుకుని చదివేలా ప్రోత్సహించాలి. విద్యార్థులు చదివే స్థాయిని బట్టి వారిని గ్రూపులుగా విభజించి ఒకరికొకరు సహాయం చేసుకునేలా ప్రోత్సహించాలి. ఇంటి వద్ద కూడా విద్యార్థులు చదివేలా వారికి గ్రంథాలయ పుస్తకాలతో పాటు రకరకాల మ్యాగజైన్‌లు కూడా ఇవ్వాలి. వాటిని తల్లిదండ్రులకు చదివి వినిపించమని అవగాహన కల్పించాలి. ప్రతిరోజూ ప్రార్థన సమయంలో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులతో పుస్తకాల్లోని కొన్ని అంశాలను చదివించాలి. విద్యార్థులు చదివే సందర్భంలో వాటిని వీడియో తీసి పాఠశాల గ్రూపుల్లో షేర్ చేయాలి. అలాగే వాటిని జిల్లా, రాష్ట్రస్థాయికి, తల్లిదండ్రులకు పంపాలి. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రతీ శనివారం పఠన పోటీలు నిర్వహించాలి. ప్రతీనెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థులతో చదివించాలి. బాగా చదివే పిల్లలను అభినందించాలి. విద్యార్థులు ఇంటి వద్ద కూడా చదివేలా తల్లిదండ్రులను ప్రోత్సహించమని చెప్పాలి. విద్యార్థుల పుట్టినరోజు సందర్భంగా వారికి బహుమతులుగా పుస్తకాలు అందించాలి.

గ్రంథాలయ వారోత్సవాల్లో..

కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సభ్యులను ఇందుకోసం వినియోగించుకోవాలి. అన్ని పాఠశాలల్లో జూలై 10 నుంచి 15వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, ఇతరులు పాఠశాలను సందర్శించిన సందర్భంలో వారితో గ్రంథాలయంలోని కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించి పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలి. జూలై 15న అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి ప్రముఖులను ఆహ్వానించాలి. ప్రతీ ఉపాధ్యాయుడి వద్ద తమ తరగతిలో వారివారి సబ్జెక్టుల్లో ఎంతమంది విద్యార్థులు ధారాళంగా చదువుతారు.. ఎంతమంది నెమ్మదిగా చదువుతారు.. ఎంతమంది చదవరానివారు ఉన్నారు.. మొదలైన వివరాలు కలిగి ఉండాలి. ప్రధానోపాధ్యాయుల వద్ద పాఠశాల వివరాలన్నీ ఉండాలి.

వనరులు ఇవే..


NCERT website, National Book Trust (NBT). Story Weaver https://storyweaver.org.in, SCERT website, https://prathambooks.org) Room to Read Cloud https://literacycloud.org

తెలంగాణ ఎస్సీఈఆర్టీ వెబ్ సైట్‌లోని ఆడియో శతక పద్యాలు, దీక్షా పోర్టల్, కహానియోం కా పిటారా, చందమామ కథలు, బాలసాహిత్యం, బాలల మాస పత్రికలు, మ్యాగజైన్లు మొదలగునవి. పిల్లలంతా ధారాళంగా చదివేలా చేసి వారి అభ్యసనాన్ని మెరుగుపర్చడానికి ఇవి ఉపకరిస్తాయి.

వివిధ స్థాయిల్లో పర్యవేక్షణ

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని అన్ని పాఠశాలలను నెలకోసారి సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి. కాంప్లెక్స్ సమావేశాల్లో వీటిని సమీక్షించుకోవాలి. మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు తొలిమెట్టు కార్యక్రమంలో సూచించిన విధంగా వివిధ పాఠశాలలను సందర్శించినప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి. మండల, జిల్లా స్థాయిలో తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, ఉపాధ్యాయులతో కోర్ కమిటీ టీం ఏర్పాటు చేసి వారు ఒక వాట్సాప్ గ్రూప్ ద్వారా కథలు, గేయాలు, ఆడియో స్టోరీస్ మొదలైన వాటిని పాఠశాలలకు పంపేలా చూడాలి. జిల్లాస్థాయిలో నెలకోసారి మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించుకోవాలి. రాష్ట్రస్థాయిలోని ఎస్సీఈఆర్టీ సమగ్ర శిక్ష అధికారులు కూడా వివిధ జిల్లాల్లో మానిటరింగ్ నిర్వహిస్తారు. తొలిమెట్టు ద్వారా ఆశించే ఫలితాలను మరింత చేరువ కావడం కోసం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారులు పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. నిర్మల్ జిల్లాకు ఇదివరకే 10,952 గ్రంథాలయ పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటిని జిల్లాలోని 29 ప్రాథమికోన్నత పాఠశాలలు, 72 ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను ఆయా పాఠశాలల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు.

పఠన నైపుణ్యాలు పెంచేందుకే..



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పఠన నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా 'పఠనోత్సవం' కార్యక్రమాన్ని విద్యాశాఖ ప్రవేశపెట్టింది. ఈ మేరకు జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇదివరకే తగిన సూచనలు చేశాం. ఈనెల 26 (సోమవారం) నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. విద్యార్థుల్లో భాషాపరమైన పఠనాసక్తి, పఠన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలి.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

నేడు వ్యవసాయాధికారితో ఫోన్ ఇన్

నిర్మల్‌చైన్‌గేట్: వానాకాలం పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు రైతులకు అందించేందుకు సోమవారం జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్‌తో సాక్షి 'ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ఏయే నేలల్లో ఏయే పంటలు సాగు చేయాలి.. ఏ రకమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాలు ఎంచుకోవాలి.. నకిలీ విత్తనాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎప్పటివరకు పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి.. తదితర సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

సమయం: సోమవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 72888 94009

ఘనంగా బోనాల పండుగ



శివసత్తులకు బోనమెత్తుతున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌కాలనీలోగల రాజరాజేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో బోనమెత్తి అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తులు ప్రత్యేక విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సకాలంలో వానలు పడాలని, మంచి దిగుబడులు రావాలని, అంతా ఆరోగ్యం, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఆలయ కమిటీ, కాలనీవాసులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహానికి తిలకం దిద్దుతున్న మంత్రి

శివాజీ విగ్రహం ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి ఐకే రెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ నాయకుడు పాకాల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు పెడితే కఠినచర్యలు



సోన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

సోన్: సోషల్ మీడియాలో ఇతరులపై అనుచిత పోస్టులు పెడితే కఠినచర్యలు తప్పవని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరించారని తెలిపారు. ఒరిజినల్ వీడియోకు వేరే వాయిస్‌ను జోడించి మంత్రి పరువుకు భంగం కలిగేలా చేశారని పేర్కొన్నారు. వారి పార్టీ నాయకులను రెచ్చగొట్టి మంత్రి ఐకేరెడ్డిని కించపరిచేలా వీడియో క్రియేట్ చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన వెలిశాలి తిరుమలాచారి, దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన చెల్ల సాయి ఒక వీడియో ఎడిట్ చేసి సోన్ గ్రామానికి చెందిన సుంకరి నరేశ్ అనే వ్యక్తికిచ్చి 'సువర్ణపురి ఆణి ముత్యాలు' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయమని చెప్పారని పేర్కొన్నారు. దీంతో నరేశ్ 'సువర్ణపురి ఆణిముత్యాలు' వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడని తెలిపారు. తర్వాత చెల్ల సాయి 'దిలావర్‌పూర్' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసి.. దీనిని మిగతా గ్రూపుల్లో షేర్ చేయమని తెలిపినట్లు పేర్కొన్నారు. 'సువర్ణపురి ఆణిముత్యాలు' వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసిన వీడియో మంత్రి ఐకేరెడ్డిని కించపరిచేలా ఉందని తెలిపారు. తమ పార్టీకి చెందిన వారిని రెచ్చగొట్టేలా, ఇరువర్గాల మధ్య గొడవలు పెట్టేలా ఉందని సోన్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శానం గంగాధర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. తర్వాత దర్యాప్తు ముమ్మరం చేసి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిర్మల్ ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్ సహకారంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి మూడు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు దర్యాప్తునకు సహకరించిన సోన్ సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై రవీందర్, నిర్మల్ ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, సోన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత



సాయం అందుకున్న విద్యార్థులతో రమణేశ్వర్

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు కుంట రమణేశ్వర్–స్రవంతి దంపతులు పలువురు పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూతనందించారు. జిల్లాకేంద్రంలోని కావేరి ఫౌండేషన్ వారి డాక్టర్ కావేరి కుటీరంలో ఏర్పాటు చేసిన కుంట ఆరాధ్య తొమ్మిదో జయంతి సందర్భంగా ఆదివారం పలువురు నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పిల్లల వైద్యుడు అప్పాల చక్రధారి మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా డాక్టర్ కుంట రమణేశ్వర్–స్రవంతి దంపతులు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూత అందించడం అభినందనీయమన్నారు. చదువుకోలేని స్థితిలో ఉన్న నిరుపేద విద్యార్థులైన పొన్కల్ గ్రామానికి చెందిన ఈ రోజాకు రూ.64 వేల విలువైన ల్యాప్‌టాప్, హాస్టల్‌ఫీజు కోసం రూ.50వేలు అందించారు. కౌశిక్, విశాల్‌కు రూ.40వేల ఫీజు చెల్లించారు. భవాని, దీప్తి, శ్యామలకు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున అందించారు. ఐఎంఏ నిర్మల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, కుంట భూమన్న, డాక్టర్ కృష్ణంరాజు, తుమ్మల దేవరావు, అప్పాల మహేశ్, అప్పాల అనురాధ, కూన రవి, విజయ, సుజాత, అన్నపూర్ణ, అరవింద్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం'

నిర్మల్‌చైన్‌గేట్: భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయమని బీజేపీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో విధించిన అత్యధిక పరిస్థితి దేశ చరిత్రలో ఓ చీకటి అధ్యాయమని పేర్కొన్నారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా కార్యదర్శి కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం నారాయణగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, నాయకులు ఆడెపు సుధాకర్, అయ్యన్నగారి రాజేందర్, దశరథ్ పోశెట్టి, జంగిటి నారాయణ, శశిరాజ్‌వర్మ, మహేందర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు కానున్న మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గోపిచంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ mjptbcwreir.teanfana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సజావుగా సీఆర్టీల నియామకపరీక్ష


కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని ఐదు కేంద్రాల్లో సీఆర్టీల నియామకపరీక్ష శుక్రవారం సజావుగా నిర్వహించినట్లు ఐటీడీఏ డీడీ డా. దిలీప్‌కుమార్ తెలిపారు. మొత్తం 1818 అభ్యర్థులకు గాను 1691 మంది హాజరయ్యారని 127 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంవోతో కలిసి అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక పరిశీలకులుగా ఏటీడీవోలు, జేసీడీవో, స్పోర్ట్స్ అధికారులు వ్యవహరించారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌లో పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడులు చేయగా, 9మంది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి పేకాట ముక్కలతోపాటు రూ.17,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పంట పొలాల్లోని విద్యుత్ సర్వీస్ కేబుల్ చోరీ

మందమర్రిరూరల్: సారంగపల్లి పంచాయతీ పరిధిలోని పలువురు రైతుల పంట పొలాల్లోని విద్యుత్ మీటర్ నుంచి బోర్ వరకు ఉన్న సర్వీస్ కేబుల్‌ను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఆదివారం 8 మంది రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ విద్యుత్ స్తంభం నుంచి సుమారు 15మీటర్ల మేరకు సర్వీస్ కేబులు ఎత్తుకెళ్లారని తెలిపారు. అసలే పంటల సమయం కేబుల్ వైర్ చోరీకి గురికావడంతో చాలా ఇబ్బంది అవుతుందని, దొంగలను గుర్తించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన మూగ, చెవిటి యువకుడు సిరాజ్‌ఖాన్ గత రెండు రోజులుగా అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఆ కాలనీకి చెందిన సిరాజ్‌ఖాన్ ఈనెల 23న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటి చేరుకోకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల గాలించారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో ఆయన తండ్రి అక్రమ్‌ఖాన్ ఆదివారం టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మాకేది పెట్టుబడి?


దుక్కి దున్నుతున్న కౌల్లు రైతు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది సంతోష్. ఈయనది మర్లపెల్లి స్వగ్రామం, బోథ్ మండలం. గ్రామంలో ఆరు ఎకరాల భూమిని రూ.80 వేలకు కౌలుకు తీసుకున్నాడు. ఐదెకరాల్లో శనగ పంట వేశాడు. నీటి కొరత, విద్యుత్ సమస్యతో పంటలకు సరిపడా నీరందించలేదు. మొత్తం 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దాదాపు రూ.70 వేలు ఖర్చు చేశాడు. కనీసం పెట్టిన పెట్టుబడికూడా రాలేదని వాపోయాడు. ఇదీ ఉమ్మడి జిల్లాలోని కౌలు రైతులందరి పరిస్థితి.

- కౌలు రైతులకు అందని పథకాలు
- వర్తించని రైతుబీమా, రైతుబంధు
- తమకూ పథకాలు అందివ్వాలని వేడుకోలు

బోథ్: సొంత భూమి లేదు..బ్యాంక్‌కు వెళ్తే రూపాయి రుణం పుట్టదు. తమ జీవనం కొనసాగాలంటే వ్యవసాయం చేయక తప్పదు. అప్పోసప్పో చేసి భూములను కౌలుకు తీసుకుని ఉమ్మడి జిల్లా రైతులు పంటలు పండిస్తున్నారు. సాగులో ఎన్ని ఆటంకాలు వచ్చినా నష్టాలు ఎదురైనా భరిస్తున్నారు. అప్పు చేసి పంటలు సాగు చేసినా దిగుబడి రాక నష్టాలపాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందని పరిస్థితి. భూ యజమానులకే మాత్రమే రైతుబంధు, రైతుబీమా వర్తించడంతో తమను విస్మరించడంతో పెట్టుబడి సాయం, ఇతరత్రా పథకాలను దూరమవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో.. కౌలు రైతుల వివరాలు

అదిలాబాద్	28,763
నిర్మల్	33,212
కుమురంభీం	26,584
మంచిర్యాల	28,584
మొత్తం గుర్తింపు కార్డులున్నా వారు	5314
ఆత్మహత్యలు చేసుకున్నవారు	330

కౌలు గుర్తింపు కార్డులేవి?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,17,143 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో 5314 మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కార్డులు జారీ చేయాలంటే భూ యజమానులు కౌలుకు ఇస్తున్నట్లు అంగీకారం తెలపాల్సి ఉంటుంది. కాని వారు కౌలునామా పత్రాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,17,143 మంది కౌలు రైతులు ప్రభుత్వం అందించే పంట రుణం, రాయితీ విత్తనాలు తీసుకునే అవకాశం లేకుండా పోతోంది.

అందని రైతుబంధు

రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం కౌలు రైతులకు అందడం లేదు. వ్యవసాయం చేయకున్నా భూ యజమానులు రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10 వేలు తీసుకుంటున్నారు. కాని వారి భూముల్లో నిజంగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి పైసా అందడం లేదు. కనీసం రుణాలు అందకపోవడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలు సరిగా పండకపోతే లక్షల్లో అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితులు ఉన్నాయని వారు వాపోతున్నారు.

పథకాలు వర్తింపజేయాలి



రైతులకు మాదిరిగా కౌలు రైతులకు ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా ఇతర పథకాలు వర్తింపజేయాలి. ప్రభుత్వం నుంచి సాయం అందక నష్టపోతున్నారు. ఈ పరిస్థితులు ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తున్నాయి. ప్రభుత్వం వారికి రైతుబంధు, రైతు బీమా అందజేయాలి.
– బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

బీజేపీలో ఏం జరుగుతోంది?


సోయం బాపూరావు


పాయల్ శంకర్


రాథోడ్ రమేశ్


సుహాసినీరెడ్డి

- ఎంపీ సోయం వ్యాఖ్యల వీడియో, ఖండన తీరు పార్టీలో దుమారం
- అంతర్గత వ్యవహారం బయటకు తేవడం వెనుక వ్యూహం అనే చర్చ
- రాథోడ్ రమేశ్, పాయల్ శంకర్‌పై ఎంపీ విమర్శలు
- మరో వ్యవహారంలో జిల్లా క్రమశిక్షణ కమిటీపై అధిష్టానానికి సుహాసినీరెడ్డి ఫిర్యాదు

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీలో ఏం జరుగుతోందని ప్రస్తుతం ఆ పార్టీలోని సామాన్య కార్యకర్త నుంచి మొదలుకుని ముఖ్యనేతల వరకు ఇదే చర్చ సాగుతోంది. ఎంపీ సోయం బాపూరావు ఎంపీ ల్యాడ్స్ పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో బయటకు రావడం, వాటిని ఖండిస్తూ సోయం ముఖ్యనేతలు రాథోడ్ రమేశ్, పాయల్ శంకర్‌పై సూటిగా విమర్శలు గుప్పించడం పార్టీలో చర్చకు దారితీసింది. ఇదిలా ఉంటే ఐదు రోజుల తర్వాత ఆ వీడియో క్లిప్‌ను బయటకు తీసుకురావడంలో వ్యూహం ఉందనే చర్చ సాగుతోంది. మొత్తంగా పార్టీలో ముఖ్యనేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయన్నది ప్రస్ఫుటం అవుతోంది.

వరుస పరిణామాలు

రెండేళ్లుగా బీజేపీలో జరుగుతున్న పరిణామాలు పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంటున్నాయనే ది సామాన్య కార్యకర్తలోనూ వ్యక్తమవుతున్న అభిప్రాయం. కరోనా సమయంలో ఓ బీజేపీ నేత కు సంబంధించిన ఫౌండేషన్‌కు రూ.15 లక్షల ఎంపీ ల్యాడ్స్ ఇచ్చినట్లు బహిర్గతం కావడం తీవ్ర దుమారం రేపింది. ఇచ్చోడలో ఓ అసైన్డ్ భూమికి సంబంధించిన వ్యవహారంలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఒకరితో తీవ్రస్థాయి పదజాలంతో మాట్లాడిన ఆడియో క్లిప్ బయటకు వచ్చింది. అప్పట్లో ఇది తీవ్ర దుమారం లేపింది. కొద్దిరోజుల క్రితం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి రేణుక సిమెంట్ భూముల వ్యవహారంలో కొంతమంది పార్టీ నేతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి జిల్లా క్రమశిక్షణ కమిటీ వివరణ కోరడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీలో అనేక సంఘటనలు జరుగుతున్నప్పటికీ వాటికి సంబంధించి క్రమ శిక్షణ కమిటీ పట్టించుకోదని, కేవలం తన కోసమే ఈ కమిటీని నియమించారా? అని ఆమె ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఆమె రాష్ట్ర క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయడం తాజాగా సంచలనం కలిగిస్తోంది. ఈ పరిణామాలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.

ఎంపీ ల్యాడ్స్ దుమారం..

గడిచిన సోమవారం ఎంపీ సోయం బాపూరావు ఆదిలాబాద్‌లో ఎంపీటీసీలు, కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వీడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అది అంతకుముందు ఐదురోజుల క్రితం జరి గిన కార్యక్రమానికి సంబంధించిందని చెప్పుకుంటున్నారు. ఈ క్లిప్‌లో సోయం బాపూరావు ఎంపీ ల్యాడ్స్‌పై మాట్లాడటం జరిగింది. ప్రధానంగా పార్టీ ఎంపీటీసీలకు, కౌన్సిలర్లకు ఇప్పటివరకు ఈ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాటల్లో ఉంది. తాజాగా వచ్చిన రూ.5 కోట్ల నిధుల్లో అందరికి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అంతే కాకుండా మొదట్లో నిధులను ఇవ్వలేకపోవడంపై కారణం తెలుపుతూ ఇంటి నిర్మాణం, కుమారుడి పెళ్లి విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై తీవ్ర దుమారం లేవడంతో తలమడుగులో ప్రస్తావించిన ఆ వ్యాఖ్యల్లో తీరుమారిందని చెప్పుకుంటూ వస్తూ ఇల్లు కట్టడం, మ్యారేజ్‌లో బిజీగా ఉండడం వల్ల పార్టీ కార్యకర్తలకు ఇవ్వలేకపోయానని చెప్పినట్లు ఎంపీ వివరించారు. ఆ నిధుల వినియోగంలో నిబంధనలు ఉంటాయని, అవి దుర్వినియోగం జరగలేదన్నారు. అంతేకాకుండా తాను ముక్కుసూటిగా ఉండటంతో పార్టీలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు నచ్చడం లేదంటూ, ఓర్వలేకనే ఇలా చేశారని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీలో కలకలం కలిగించింది.

ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారు

- కుటుంబీకులతో కలిసి మహిళ ఆందోళన
- అత్తారింటి ఎదుట ధర్నా


ఆందోళన చేస్తున్న నేరడి లత, కుటుంబీకులు

సారంగాపూర్: తన భర్త చనిపోయి నాలుగేళ్లయినా రావల్సిన ఆస్తిని పంపకాలు చేయడం లేదని మహిళ ఆందోళనకు దిగింది. మండలంలోని ధని గ్రామంలో ఆదివారం తన కుటుంబీకులతో కలిసి అత్తారింటి ఎదుట ధర్నా చేపట్టింది. టెంటు వేసుకుని భీష్మించుకు కూర్చుంది. ఆస్తి పంపకాలు చేయకుండా తన మరదలు అడ్డుకుని వేధిస్తున్నారని ఆరోపించింది. ఆందోళనకు దిగిన నేరడి లత తెలిపిన వివరాలు.. తన భర్త సురేందర్‌కు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. సురేందర్ నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. ఆ సమయంలో మామ గజ్జన్న.. ఆస్తిని ముగ్గురు సమంగా పంపకాలు చేసుకోవాలని, ఉన్న అప్పులు తీర్చాలని పత్రాలు రాయించాడు. రెండేళ్ల క్రితం గజ్జన్న మృతి చెందాడు. కాగా, లతకు ముగ్గురు కూతుళ్లు. పెద్దకూతురుకు అలేఖ్య వివాహం చేయడానికి దాదాపు రూ.8 లక్షల వరకు అప్పు చేసింది. హర్షిణి మానసిక వికలాంగురాలు. ఆరాధ్య, హరిణిల చదువులకు ఇబ్బంది పడుతున్నానని గ్రామస్తులు, పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఫలితం లేకపోయింది. ఓ సారి తనతోపాటు పిల్లలపై దాడి చేస్తే నిర్మల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని లత తెలిపారు. అయినా ఆస్తి పంచకుండా ఇద్దరు మరదలు కలిసి తనను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు.

రియల్ వ్యాపారిపై కత్తులతో దాడి

ఆదిలాబాద్‌టౌన్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరో రియల్ వ్యాపారిపై కత్తులతో దాడికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. ఖానాపూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి జహీర్‌ఖాన్ జేకే ఇంతియాజ్ వద్ద మూడు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఆ ప్లాట్లను పట్టణానికి చెందిన పత్తి ముజ్జుకు విక్రయించాడు. కొన్ని డబ్బులు చెల్లించగా, మిగతావి చెల్లించాల్సి ఉంది. అయితే రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నాడు. శనివారం జహీర్‌ఖాన్ ఆయనకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే ఫోర్‌పిట్ చేస్తానని తెలిపాడు. దీంతో పత్తి ముజ్జు తన స్నేహితులు ఆదిల్, ఆబిద్, ఇస్మాయిల్, అతిఖ్, మరో నలుగురితో రాత్రి 10 గంటల సమయంలో జహీర్‌ఖాన్ ఇంటికెళ్లి ఆయనపై కత్తులతో దాడి చేశారు. కుడి చేయికి గాయం కావడంతో అడ్డొచ్చిన ఆయన భార్య చీర సైతం చిరిగింది. బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అనారోగ్యంతో దళిత నాయకుడి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే జోగు రామన్న


అంత్యక్రియలో పాల్గొన్న గ్రామస్తులు

జైనథ్: మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు ఈర్గల గంగన్న అనారోగ్యంతో మృతిచెందాడు. దళితుల హక్కుల కోసం ఏళ్లుగా కృషి చేస్తున్న గంగన్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని మరణవార్త తెలిసిన ఎమ్మెల్యే జోగు రామన్న ఆదివారం జైనథ్‌కు వచ్చి నివాళులర్పించారు. కుటుంబీకులతో మాట్లాడి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గంగన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేశ్, గ్రామస్తులు భారీగా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఊరికి ఉపకారం

- సొంత ఖర్చుతో మంచినీటి బావి నిర్మాణం
- విశ్రాంత ఉపాధ్యాయుడి ఔదార్యం


తవ్వించిన బావి వద్ద రిటైర్డ్ టీచర్ ప్రకాశ్‌రావు దంపతులు

నెన్నెల: ఆకలితో అలమటించే సమయానికి బుక్కెడు అన్నం... దాహంతో ఉన్న వారికి గుక్కెడు నీరు అందిస్తే అంతకన్న మించిన సేవ, సాయం మరొకటి లేదు. ప్రార్థించే చేతులకన్న.. సాయం చేసే చేతులు మిన్న అనే నానుడిని మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జెడ్పీఎస్‌ఎస్ రిటైర్డ్ టీచర్ దండనాయకుల ప్రకాష్‌రావు నిజం చేశారు. మైలారం గ్రామంలోని పెద్దవాడలోని బోరు పాడైంది. మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీళ్లు రాక నీటి కోసం అల్లాడుతున్న గిరిజనుల బాధలు చూసి రూ.30వేలతో బావి తవ్వించాడు. సమాజం మనకు ఏమి ఇచ్చిందనేది కాదని, మనం సమాజానికి ఏమిచ్చామనేదే ముఖ్యం అంటున్నారని ప్రకాశ్‌రావు. మా నాన్న సుగుణాకర్‌రావు ప్రధానోపాధ్యాయుడిగా నెన్నెల హైస్కూల్‌లోనే విద్యను బోధించారని, ఆయన సైతం గిరిజనుల కోసం మైలారంలోని చిన్నవాడలో బావి తవ్వించారని, తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని ఊరి కోసం తనకు తోచిన విధంగా బావి తవ్వించినట్లు చెబుతున్నాడు. ఇలాంటి సేవలు మరిన్ని చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళపై లైంగికదాడి.. హత్య

- మద్యం మత్తులో కామాంధుల అఘాయిత్యం
- చంపి.. వ్యవసాయబావిలో పడేసి
- ధనోరా శివారులో ఆలస్యంగా వెలుగులోకి..
- సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల్లో ఒకరి అరెస్టు
- ఉట్నూర్‌కు తరలింపు, డీఎస్పీ విచారణ


కుద్మేత జంగుబాయి (ఫైల్)

ఇంద్రవెల్లి: ముగ్గురు కామంధులు మద్యం మత్తులో ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడి ఆపై హత్య చేశారు. మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గుర్తుతెలియని మృతదేహాన్ని నేరడిగొండ మండలం చించోలి గ్రామానికి చెందిన కుద్మేత జంగుబాయి (35)గా కుటుంబీకులు గుర్తించారు. తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడు కుద్మేత భీంరావ్ ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సునీల్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. భర్త కుద్మేత నారాయణ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ పోషణ నిమిత్తం జంగుబాయి గ్రామ, వారసంతల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తోంది. వారం క్రితం జంగుబాయి తల్లిగారిల్లు అయిన దనోరా(బి) గ్రామానికి వచ్చి ఈనెల 20న వెళ్లిపోయింది. బంధువులు కూడా ఆమె తన గ్రామానికి వెళ్లిపోయి ఉండవచ్చని అనుకున్నారు. కాగా, శనివారం దనోరా(బి) శివారులోని వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం లభ్యమైంది. కాగా, పోలీసులు గ్రామ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలను పరిశీలించారు. మంగళవారం రాత్రి 12 గంటల తర్వాత గ్రామపొలిమేరలో జంగుబాయిను గ్రామానికి చెందిన పసరే సంతోష్, సముక్‌రావ్ సంతోష్, షేక్ ఖదీర్‌లు రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. లైంగికదాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సీసీ పుటేజీల్లో గుర్తించిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ నాగేందర్ విచారిస్తున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నిందితులను ఉరితీయాలని మృతురాలు బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.


ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఆదివాసీ సంఘాల డిమాండ్
- ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ధర్నా


నాయకులను సముదాయిస్తున్న డీఎస్పీ

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం ధనోర(బి) శివారులో ఆదివాసీ మహిళను లైంగికదాడి చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట మృతురాలి కుటుంబీకులతో కలిసి నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గణేశ్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు లైంగికదాడి చేసి హత్య చేసి బావిలో పడేశారన్నారు. నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుమారుడు భీంరావును ఆదుకోవాలన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగేందర్ అక్కడికి చే రుకుని వారిని సముదాయించారు. అనంతరం సంఘాల నాయకులు, కుటుంబీకులు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని కలిశారు. మృతురాలి కుమారుడికి చదువుతోపాటు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్కబాపురావు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, ఆదివాసీ సంఘాల నాయకులు సోయం లలిత, మర్సుకోల తిరుపతి, పెందూర్ దత్తు, కాత్లే పృథ్వీరాజ్, సునీల్ జాదవ్, సెడ్మకి భీంరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమల్లన్నస్వామి కల్యాణం


పెద్దపట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు


ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న భక్తులు

- వేలాలలో భక్తుల సందడి
- పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా తొలి ఏకాదశ సందర్భంగా శ్రీమల్లన్నస్వామి కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా రెండ్రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తొలిరోజున శ్రీ మల్లన్నస్వామి, కేతమ్మ, భ్రమరాంభికలకు పవిత్ర గోదారి నదిలో స్నానం చేయించారు. అనంతరం ఆదివారం ఉదయం ఆలయంలో గొల్లపూజారులు, ఒగ్గుపూజారులు సంప్రదాయబద్ధంగా పెద్దపట్నం వేసి శ్రీ మల్లన్నస్వామి, కేతమ్మ, భ్రమరాంభికలకు కనుల పండువగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం వీక్షించడానికి పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో వేలాల సందడిగా మారింది. అనంతరం అగ్నిగుండాలు నిర్వహించగా మల్లన్న స్వామి భక్తులు నిప్పులపై నుంచి నడిచారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మణ్, ఎంపీటీసీ రాజేశ్వరి రాజబాపు, ఉప సర్పంచ్ డేగ నగేశ్ పాల్గొన్నారు.

ఆరుద్ర పురుగుల ఆగమనం

నెన్నెల/భీమారం: వ్యవసాయ పనులు మొదలుపెట్టేందుకు ఆరుద్రకార్తే అనుకూలమైంది. సంవత్సరంలో ఆరుద్రకార్తేలో మాత్రమే ఆరుద్ర పురుగు కనిపిస్తుంది. ఆరుద్ర కార్తేకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. చూడగానే ముద్దు వచ్చే రూపంతో నెన్నెల, భీమారం శివారులోని చేనుల్లో ఆదివారం ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. ఈ నెల 23న ఆరుద్ర కార్తే ప్రారంభమైంది. ఈ పురుగులు ఆగమనాన్ని రైతులు శుభసూచికంగా భావిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


నెన్నెల శివారులో కనిపించిన ఆరుద్ర పురుగులు